www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 182, సోమవారం 3-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ఏజెన్సీ గ్రామాల్లో
మద్యం సిండికేట్‌కు అడ్డుకట్ట ఎప్పుడు..?



3లో..

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై
రాకపోకలకు గ్రీన్ సిగ్నల్



5వ పేజీల్లో

## ప్రపంచ స్థాయికి

# తెలంగాణను తీసుకెళ్తున్నాం

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 2 :**

తెలంగాణలోని తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశం అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్లో జరిగింది.

ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలకు భట్టి విక్రమార్క

..మిగతా 2లో



## వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి

# బోనాలు

అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

సికింద్రాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు

ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు - మహంకాళి

అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 2**

సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సీఎంకు నిర్వాహకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు ఉన్నారు. కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు.

అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన పొన్నం : అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నట్లు

..మిగతా 2లో

# క్షమించరాని తప్పు చేశాను

బాలిక ఆవేదన.. "నా వయసు కేవలం 15 ఏళ్లే..

నన్ను క్షమించండి": ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలిక క్షమాపణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 2 :**

జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర అభ్యంతరకర పదజాలం ఉపయోగించిన కేసులో నిందితురాలిగా ఉన్న బాలిక సోషల్ మీడియా వేదికగా బహిరంగ క్షమాపణలు చెప్పింది. చేతులు జోడించి నమస్కరిస్తూ.. మాట్లాడిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతోంది. ఇతరుల

..మిగతా 2లో

# మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు..



ప్రభుత్వంపై జోగిని శ్యామల ఫైర్

సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఏర్పాట్లపై ప్రముఖ జోగిని శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు.. ప్రభుత్వంపై జోగిని శ్యామల ఫైర్

**హైదరాబాద్, ఆగస్టు 2 :**

మేం కన్నెర్రజేసి ఏడిస్తే తెలంగాణ రాష్ట్రానికే అరిష్టమని, మంచిది కాదని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరైన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి, తమలో ఊపిరి ఉన్నంత వరకు ఇదే వృత్తిలో ఉండి అమ్మవారి సేవకు అంకితం అవుతామని అన్నారు. గత ప్రభుత్వంలో కొంతైనా సాధారణ భక్తులకు, జోగినిలకు ప్రయారిటీ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల అతి దారుణంగా వ్యవహరిస్తోందని జోగిని శ్యామల కామెంట్ చేశారు. వేలాదిగా ఉన్న శివశక్తుల్లో కేవలం తమకు 5 పాస్‌లు ఇస్తామని చెప్పారని అన్నారు. ఆ ఐదుగురిలో బాగా ఫేమస్ అయిన వాళ్లకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని వేడుకున్నామని, పోలీసులు మాత్రం తమ రిక్వెస్ట్‌ను పట్టించుకోలేదని ఆరోపించారు. అమ్మవారిని దర్శించుకునే

..మిగతా 2లో

## అలా హామీ ఇస్తేనే

# వచ్చే ఎన్నికల్లో పోటీ

లేకుంటే తప్పుకుంటా.. మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఆగస్టు 2:**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు మాట ఇస్తేనే తాను బరిలో ఉంటానని, లేదంటే తప్పుకుంటానని మంత్రి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నామినేషన్ వేసిన తర్వాత ప్రచారానికి రాకపోయినా.. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో తన ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

..మిగతా 2లో



# ముదిరిన కావేరి జల వివాదం

ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి

కావేరి నదీ జలాల పంపకాలపై కర్ణాటక-తమిళనాడు మధ్య మరోసారి వివాదం తీవ్రరూపం దాల్చింది.

ముదిరిన కావేరి జల వివాదం: ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి



# పాకిస్థాన్‌లో విషాదం

శాంతి ర్యాలీలో ఆత్మాహుతి దాడి.. 14మంది మృతి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:**

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన శాంతి ర్యాలీపై ఆత్మాహుతి బాంబు దాడి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. స్వాత్ జిల్లాలోని కబల్ పట్టణంలో నిర్వహించిన ఉగ్రవాద వ్యతిరేక శాంతి ర్యాలీని లక్ష్యంగా చేసుకుని దాడి జరగ్గా.. 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు పోలీసులు, సాధారణ పౌరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 20 మందికిపైగా గాయపడ్డారు.

స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో మిలిటెంట్ కార్యకలాపాలను అరికట్టాలని, శాంతి భద్రతలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలోకి వచ్చిన ఓ ఆత్మాహుతి దాడిదారు తన వద్ద ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకోవడంతో భారీ పేలుడు సంభవించింది.

పేలుడు అనంతరం పోలీసులు, సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను

..మిగతా 2లో

# వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు



**మొదటి పేజీ తరువాయి...**

వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు సేవలందిస్తున్నారు. బోనాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన, అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ భాగ్యనగరంలో ఆషాఢ బోనాల పండుగకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల జాతరలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని వివరించారు. భక్తుల భద్రత, రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ : ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలకు దాదాపు 2,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. ఉత్సవాల్లో ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను మహంకాళి ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక ఏఐ వ్యవస్థ ద్వారా ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలతో ముఖాలను విశ్లేషించే 'ఫేషియల్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. దీనివల్ల పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను తక్షణమే గుర్తించి అప్రమత్తమయ్యే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

తొక్కిసలాటలు జరగకుండా చర్యలు : అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను క్యూ మేనేజ్‌మెంట్ ద్వారా కచ్చితంగా లెక్కిస్తామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. ఆలయం లోపల వివిధ విభాగాలు, క్యూ లైన్లలో భక్తుల రద్దీ సాంద్రతను 'థ్రెషోల్డ్ మ్యాపింగ్' ద్వారా నిరంతరం విశ్లేషిస్తూ, పరిమితికి మించి రద్దీ పెరిగితే ముందస్తు చర్యల ద్వారా తొక్కిసలాటలు జరగకుండా నివారిస్తామని స్పష్టం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, తదితర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నామని వివరించారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని, జాతర విజయవంతంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు



## ఉత్సవాల నిర్వహణకు

# బిచ్చమెత్తుకోవాలా?

## రాష్ట్ర ప్రభుత్వంపై బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్, ఆగస్టు 2:**

రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, హిందూ పండుగల పట్ల పక్షపాతం చూపిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. హిందూ ఉత్సవాల నిర్వహణకు కావాల్సిన నిధుల కోసం హిందువులు బిచ్చమెత్తుకునే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఆయన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రంజాన్ పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించింది. అయితే, 80 శాతానికి పైగా ఉన్న హిందువులు నిర్వహించుకునే బోనాల ఉత్సవాలకు మాత్రం కేవలం రూ. 20 కోట్లు కేటాయించడాన్ని చూస్తుంటే హిందువుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. జంట నగరాల్లోని 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాలు ఘనంగా జరుగుతుంటే, ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులు ఏ మూలకు సరిపోతాయి. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి నిధులు మాత్రం కేటాయించడం లేదు." అని బండి సంజయ్ మండిపడ్డారు.

**హిందువుల పండుగలపై ఎందుకీ నిర్లక్ష్యం..**

ఆలయ ప్రాంగణంలో తీవ్రమైన ఎండలో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం శోచనీయమని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు వచ్చి కేవలం దర్శనం చేసుకుని వెళ్లిపోతే సరిపోదని, భక్తుల ఇబ్బందులను పట్టించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే ముస్లిం... ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని మరోసారి నిరూపితమైందన్నారు. హిందూ పండుగల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చులకన భావానికి ఇది నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ బోనాల ఉత్సవాలకు నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని గుర్తుచేశారు. ముందుముందు రాబోయే గణేష్ ఉత్సవాలతో పాటు అన్ని హిందూ పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్సవాల నిర్వహణలో తమ హక్కులను కాపాడుకోవడానికి, ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి హిందూ సమాజమంతా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు

# మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు..

**మొదటి పేజీ తరువాయి...**

సమయంలో ఆలయానికి వస్తుండగా.. భక్తుల రద్దీ మధ్య తాము తీవ్ర అసౌకర్యానికి లోనయ్యామని జోగిని శ్యామల అన్నారు. జోగినిలు ఏడిస్తే.. రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టమని పేర్కొన్నారు. బోనాలకు ముందు మమ్మల్ని ప్రభుత్వం మీటింగ్‌కి రావాలని చెబితే వెళ్లామని.. వాళ్లకు సహకరించామని అన్నారు. తీరా చూస్తే సెక్యూరిటీ కల్పించకుండా, పాస్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సమంజసమేనా అని ప్రశ్నించారు. జోగినిల్లో అంతా చదువుకున్నవాళ్లమే ఉన్నామని, తమకు ఆలయ బోర్డులలో ఎందుకు అవకాశం కల్పించరని అన్నారు. రాష్ట్రంలో బోనాల పండుగను రాజకీయ నాయకులు, పోలీసులే చేసుకోండని సెటైర్లు వేశారు. మహంకాళి అమ్మవారి బోనాలు ఇవాళ కాదని.. జోగినులమైన తాము ఎప్పుడు బోనాలు ఎక్కిస్తామో ఆనాడు పండుగని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు.



# క్షమించరాని తప్పు చేశాను

**మొదటి పేజీ తరువాయి...**

ప్రోద్బలంతోనే తాను ప్రధానిపై ఆ తరహా అనుచిత వ్యాఖ్యలు చేశానని, తన ప్రవర్తన పట్ల తీవ్రంగా నామూషిగా భావిస్తున్నానని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ప్రస్తుతం తన వయసు కేవలం 15 ఏళ్లేనని చెప్పుకొచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

వైరల్ అవుతున్న వీడియోలో టీషర్టు ధరించిన ఆ బాలిక.. తీవ్ర పశ్చాత్తాపంతో తన పొరపాటును అంగీకరించింది. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నిందితురాలి వయస్సును 25 ఏళ్లుగా పేర్కొన్నప్పటికీ.. ఆ వీడియోలో తాను "కేవలం 15 ఏళ్ల వయసు కల్గిన చిన్న పిల్లను" అని చెప్పడం గమనార్హం."నేను చేసిన పని ఏమాత్రం క్షమించరానిది. ప్రధానిపై చాలా చెడు వ్యాఖ్యలు చేశాను. దేశ ప్రజలందరికీ నమస్కరించి క్షమాపణలు కోరుతున్నాను. నా చర్యల పట్ల నాకు చాలా సిగ్గుగా ఉంది. నన్ను నేనే చూసుకోలేకపోతున్నాను. ఇది నా మొదటి, చివరి తప్పుగా భావించి నన్ను క్షమించండి" అని చేతులు జోడించి విజ్ఞప్తి చేసింది. అయితే ఈ వీడియో చేసింది నిజంగా ఆ బాలికేనా కాదా అనేది ఇంకా ధ్రువీకరణ కాలేదు.

**అసలేం జరిగిందంటే..?**

నీట్ పేపర్ లీకేజీలపై జూలై 23వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఓ యువతి ప్రధానిపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. పోలీసులు సదరు యువతిపై కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజల్లో అశాంతి రేకెత్తించడం, మానసష్టానికి పాల్పడటం వంటి భారతీయ న్యాయ్ సంహితలోని సెక్షన్లు 352, 353(1), 356(1) కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం ఈ కేసును ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**క్షమించేద్దామన్న ప్రధాని.. వెంటనే సారీ చెప్పిన బాలిక**

జంతర్ మంతర్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా ఓ వీడియో విడుదల చేశారు. తనపై, తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువతను తాను క్షమిస్తున్నానని.. అలాగే ప్రజలు కూడా వారిని క్షమించాలని ఆ వీడియోలో కోరారు. తప్పుగా మాట్లాడినప్పటికీ ఆ పిల్లలంతా మన వాళ్లేనని చెప్పుకొచ్చారు. ఈ వీడియో వైరల్ అయిన కాసేపటికే సదరు బాలిక కూడా వీడియో చేసి పెట్టడం గమనార్హంగా మారింది.

# ముదిరిన కావేరి జల వివాదం

## ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి

**కర్ణాటక-తమిళనాడు ఆగస్టు 2:**

కావేరి నదీ జలాల పంపకాలపై కర్ణాటక-తమిళనాడు మధ్య మరోసారి వివాదం తీవ్రరూపం దాల్చింది. కావేరి జలాలను విడుదల చేయాలని కోరుతూ తాజాగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సమయంలో కావేరి జలాల నిర్వహణ అథారిటీ రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రానికి తాగునీరు, ఇతర అవసరాల కోసం సుమారు 40 టీఎంసీల నీరు అవసరమని శివకుమార్ తెలిపారు. అయితే దేశ చట్టాలను గౌరవిస్తూ, తమిళనాడుపై ఉన్న చట్టబద్ధ బాధ్యతలను కూడా కర్ణాటక పాటిస్తుందని స్పష్టం చేశారు.

**ఆగస్టు 13 బంద్‌కు పిలుపు**

ఆగస్టు 13న ప్రతిపాదించిన బంద్‌ను రైతులు, ప్రతిపక్షాలు, కన్నడ సంఘాలు విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంద్ వల్ల ప్రజలకు, వ్యాపారాలకు, విద్యాసంస్థలకు ఇబ్బందులు తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగం ఉండదని అన్నారు. కావేరి జలాల వివాదాన్ని రాజకీయాలకు అతీతంగా చర్చల ద్వారా పరిష్కరించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది.



# ప్రపంచ స్థాయికి తెలంగాణను తీసుకెళ్తున్నాం

**మొదటి పేజీ తరువాయి...**

వివరించారు.

**3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.. భారత్ ఫ్యూచర్ సిటీ...**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా ఫోర్త్ సిటీగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్-జీరో ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

**యంగ్ ఇండియాతో విద్యా రంగంలో విప్లవం..**

పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ.2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లుగా ఆయన వివరించారు. ఇప్పటికే మోడల్‌గా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించామని,

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం.. మూసీకి పూర్వవైభవం ..

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు హైడ్రావ్యవస్థను తీసుకొచ్చామని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని ఆయన వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి..**

రీజినల్ రింగ్ రోడ్డు వేగవంతం చేయడం, మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా రాబట్టడం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని భట్టి విక్రమార్క వివరించారు. అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



# పాకిస్థాన్‌లో విషాదం..

సమీప ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దాడి వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ అధికారికంగా బాధ్యత స్వీకరించలేదు. ఈ ఘటనను పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు.

# అలా హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ

**మొదటి పేజీ తరువాయి...**

కీలక వ్యాఖ్యలు చేశారు. తన సొంత నియోజకవర్గం నల్లగొండలోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుంటానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు. స్వయంగా తాను ఎన్నికల ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, పలుసార్లు మంత్రిగా ఉన్నపటికీ తనకు సొంత ఇల్లు, భారీగా ఆస్తులు లేవని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తుల తప్ప తాను సొంతంగా సంపాదించుకున్నవి లేవని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్ధే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తానని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల కోసం జీవితాంతం పోరాడిన నికార్సైన కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య

**- సంస్మరణ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నివాళి**

**కారేపల్లి, ఆగస్టు 2(భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన నికార్సైన నాయకుడు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం గుంపెల్లగూడెంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి లక్ష్మయ్య సంస్మరణ సభ పార్టీ సీనియర్ నాయకుడు తుమూజు రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదారం ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం, మంచినీటి సమస్య పరిష్కారం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం, గుంపెల్లగూడెం దళిత కాలనీ అభివృద్ధి వంటి అనేక ప్రజా సమస్యల పరిష్కారంలో ఎర్రబెల్లి లక్ష్మయ్య విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో పదవులు, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం సాధారణంగా మారిందని, అలాంటి పరిస్థితుల్లో జీవితాంతం తాను నమ్మిన ఎర్రజెండాను విడువకుండా అదే సిద్ధాంతంతో చివరి శ్వాస వరకు జీవించడం లక్ష్మయ్య వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. తాను జీవితమంతా మోసిన ఎర్రజెండానే చివరికి తన అంతిమయాత్రలో కూడా కప్పుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూడా నున్నా నాగేశ్వరరావు విమర్శలు గుప్పించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధంగా పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను విస్మరించి ప్రజల దృష్టిని మతపరమైన అంశాల వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎర్రబెల్లి లక్ష్మయ్య ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల కోసం పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె. నరేంద్ర,




కమిటీ సభ్యులు జి. వెంకన్న, కావేటి రాములు, గుంపెల్లగూడెం శాఖ కార్యదర్శి ఎర్రబెల్లి సతీష్, ఎర్రబెల్లి రాము, ఎర్రబెల్లి ముత్తయ్య, ఎర్రబెల్లి రమాదేవి, నాగమ్మ, కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, బీఆర్ఎస్ నాయకుడు అజ్మీర వీరన్న, ఎర్రబెల్లి నాగేంద్రబాబు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గ్రామాల్లో మద్యం సిండికేట్‌కు అడ్డుకట్ట ఎప్పుడు..?

**- కారేపల్లి కేంద్రంగా 41 గ్రామాలకు అక్రమ సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు -- కలెక్టర్ ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని ప్రజల డిమాండ్**

**కారేపల్లి, ఆగస్టు 2(భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి మండల కేంద్రాన్ని కేంద్రంగా చేసుకుని ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాలతో పాటు మండలంలోని 41 గ్రామపంచాయతీలకు అక్రమంగా మద్యం సరఫరా జరుగుతోందని ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ప్రతిరోజూ ఆటోలు, ఇతర వాహనాల ద్వారా గ్రామాలకు మద్యం తరలించి, ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిరాటంకంగా కొనసాగుతున్నప్పటికీ, వాటిని అరికట్టాల్సిన ఆబ్కారీ శాఖ నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మద్యం అందుబాటులోకి రావడంతో యువత, కూలీలు, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, కొందరు అక్రమ వ్యాపారులు ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తూ గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారని, ఎమ్మార్పీకి మించి అదనపు ధరలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా, వార్తలు వచ్చినా క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు జరగలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాలకు మద్యం తరలిస్తున్న వాహనాలను గుర్తించి, అక్రమ విక్రయాలు జరిగితే సంబంధిత వారిపై తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా ఆబ్కారీ శాఖ, పోలీసు శాఖతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణల్లో నిజానిజాలను తేల్చి, అక్రమ మద్యం సరఫరా, బెల్ట్‌షాపులు, ఎమ్మార్పీకి మించిన ధరల వసూళ్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి




చేస్తున్నారు. "ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టం అందరికీ సమానమే. అక్రమ మద్యం వ్యాపారం ఉంటే దానిని పూర్తిగా నిర్మూలించే వరకు అధికారులు ప్రత్యేక చర్యలు కొనసాగించాలి" అని గ్రామస్తులు కోరుతున్నారు.

# వనమా విశ్వేశ్వరరావును పరామర్శించిన మాజీ ఎంపీ నామ

**- వైరాలో తన నివాసంలో కలసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న - ఎంపీ నామ**

**- కొణతాలపల్లి సుబ్బారావును పరామర్శించిన- నామ**

**వైరా, ఆగస్టు 2,( భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందిన అనంతరం వైరాలో తన స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు ఆదివారం వైరాలోని ఆ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలసి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు, ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ నాగేశ్వరరావు, ఆయన త్వరగా పూర్తిగా కోలుకొని, ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో మళ్లీ చురుకుగా పాల్గొనాలని, ఆకాంక్షించారు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అదేవిధంగా కొణతాలపల్లి సుబ్బారావుని పరామర్శించి అనంతరం వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో ఉన్న కొణతాలపల్లి



సుబ్బారావు నివాసానికి వెళ్లి సుబ్బారావుని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, మాజీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, వనమా చిన్ని, బాదావత్ బాలాజీ, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యం బాబు, తిరుపతి శ్రీను, నూకల వాసు, నూకల ప్రసాద్, వజి నేపల్లి చక్రవర్తి, కారేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, బాలాజీ, కొమ్ము కనకరత్నం, వేముల శివకృష్ణ, గుజ్జర్లపూడి దేవరాజు, యు ఎస్ కే కాసిం,



వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, కాజా సైదులు, కొణతాలపల్లి సుజిత్, దారా కృష్ణ, కిషోర్, కేశ శ్రీనివాసరావు, నాళ్ల గంగాధర్, ఖాజా ప్రవీణ్ కుమార్, కోడుమూరు రవి, ఏదునూరి శ్రీనివాసరావు, మోరంపూడి ప్రసాద్, వల్లవి శ్రీనివాసరావు, నంబూరి రామారావు, మాదినేని లక్ష్మణ్, కోడుమూరు మోహన్, ఆకుల రాజు, ఏలూరు నరసింహారావు, ఆ దూరి ప్రేమ్, నార్వనేని నారాయణ, మాలోజి రాజేష్, కొలగాని దేవరాజ్, తెల్లాకుల శ్రీనివాసరావు, ముచ్చింతల కృష్ణ, కొలకాని నాగేశ్వరరావు, తాగి నాగార్జున, ఎంద్రాతి గోపాలరావు, ముదిగొండ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాజీ ఎంపీ నామ సుడిగాలి పర్యటన

**- పరామర్శలు, ఆశీర్వాదాలు, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2,( భద్రాద్రి న్యూస్):** ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బుగ్గవీటి శ్రీధర్ తండ్రి, ప్రముఖ వైద్యులు డా. బుగ్గవీటి సమత మామయ్య, రిటైర్డ్ ఇంజనీర్ బుగ్గవీటి కోటేశ్వరరావు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నామ, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు వియ్యంకుడు, తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రామనాథం, డా. గౌతమ్, కుటుంబ సభ్యులు, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్‌రావు, వాకదాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అటుపై చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య అనారోగ్యంతో ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, ఖమ్మం మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నర్సయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నామ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తదుపరి బీఆర్ఎస్ జిల్లా నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని ఆయన



నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వైరా మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన కొణతాలపల్లి సుబ్బారావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆపై మధిర పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహదేవపురం సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు మనవడు పంచకట్టు వేడుకలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలిసి పాల్గొని పావన్ శివచంద్రను ఆశీర్వదించారు. చివరగా ఇటీవల తన మాతృమూర్తిని కోల్పోయిన మాజీ వార్డు కౌన్సిలర్ ధీరావత్ మాధవి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాజీ జడ్పీటీసీ సామినేని హరి ప్రసాద్, మాజీ దిశా కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, బిక్కి కృష్ణప్రసాద్, రావూరి శ్రీనివాసరరావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి




కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, యన్నంశెట్టి అప్పారావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగే శ్రీనివాసరరావు, మోరంపూడి ప్రసాద్‌రావు, బంకా మల్లయ్య, వంకాయలపాటి లచ్చయ్య, మాదినేని దుర్గాప్రసాద్, వాకదాని కోటేశ్వరరావు, అబ్బూరి రామన్, వనమా చిన్ని, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, తిరుపతి శ్రీను, నూకల వాసు,నూకల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, కారేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, రాయిడి భద్రయ్య, బాలాజీ, కొమ్మూరి కనకరత్నం, వేముల శివకృష్ణ, గుజ్జర్లపూడి దేవరాజు, యూఎస్‌కే ఖాసిం, వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, ఖాజా సైదులు, కొణతాలపల్లి సుజిత్, దారా కృష్ణ, కిషోర్, కేశ శ్రీనివాసరావు, నాళ్ల గంగాధర్, ఖాజా ప్రవీణ్ కుమార్, కోడుమూరు రవి, ఏదునూరి శ్రీనివాసరావు, వల్లభి శ్రీనివాసరావు, పగడాల రవి, నంబూరి రామారావు, మాదినేని లక్ష్మణ్, కోడుమూరు మోహన్, ఆకుల రాజు, ఏలూరు నరసింహారావు, అదూరి ప్రేమ్, నార్వనేని నారాయణ, మాలోజి రాజేష్, కొలగాని దేవరాజు, తెల్లాకుల శ్రీనివాసరావు, ముచ్చింతల కృష్ణా, కోలకాని నాగేశ్వరరావు, పాగి నాగార్జున, యంద్రాతి గోపాలరావు, ముదిగొండ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబోడు వద్ద విషాదం.. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

*- మరో యువకుడికి తీవ్ర గాయాలు.. ఖమ్మం ఆసుపత్రికి తరలింపు*



**కారేపల్లి, ఆగస్టు 2 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండల పరిధిలోని ఎర్రబోడు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడు కోయగుంపుకు చెందిన వజ్జా సునీల్ (36), పాయం సాయితో కలిసి మోటార్‌సైకిల్‌పై ముత్యాలగూడెం నుంచి ఎర్రబోడు మీదుగా కోయగుంపుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎర్రబోడు సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో వజ్జా సునీల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పాయం సాయికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడు సునీల్ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా విద్యుత్ శాఖ సిబ్బందికి సహాయకుడిగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సీపీఎం సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి పెద్ద లక్ష్మయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**కారేపల్లి మండలం ఆగస్టు 2 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గుంపెల్లగూడెంకు చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి పెద్ద లక్ష్మయ్య దశదిన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను, కుమారులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద లక్ష్మయ్య ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో గుంపెల్లగూడెం సర్పంచ్ కృష్ణవేణి--వీరబాబు, మండల సర్పంచుల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బుగ్గవాగు నీటిని మాదారం చెరువుకు అనుసంధానం చేయాలి

**ఎమ్మెల్యేకు గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి**



**కారేపల్లి ఆగస్టు 2 (భద్రాద్రి న్యూస్ రాములు ):** బుగ్గవాగు వద్ద వృథాగా పోతున్న నీటిని మాదారం చెరువుకు అనుసంధానం చేసి సాగునీటిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని గౌరవ ఎమ్మెల్యేను గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కోరారు. బుగ్గవాగు నీటిని మాదారం చెరువుకు మళ్లించడం వల్ల పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని వారు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుంపెల్లగూడెం గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి--వీరబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్, గ్రామ పెద్దలు భూక్యా సైదులు, ధరావత్ భాస్కర్, కిషన్, అశోక్, ఎల్లబోయిన వెంకన్న, లక్ష్మయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి

**- దశదిన కార్యక్రమానికి హాజరైన పలువురు నాయకులు**



**కారేపల్లి ఆగస్టు 2 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండల పరిధిలోని గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాము, సతీష్‌ల తండ్రి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా, ఆదివారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో పలువురు రాజకీయ, ప్రజా నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మండల నాయకులు ధరావత్ వినోద్ కుమార్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి నరేంద్ర, రామూర్తి హాజరై లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ లక్ష్మయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్రబెల్లి శ్రీను, బాబోత్ వీరన్న (చక్రం), రఘు, కోటి, భావుసింగ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే దస్తగీర్ మాతృమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ..

*- దమ్మపేట అభివృద్ధికి రూ.1.10 కోట్ల పనులకు శ్రీకారం*





**దమ్మపేట, ఆగస్టు 02 (భద్రాద్రి న్యూస్):** అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం దమ్మపేటలో పర్యటించారు. 'హలో శుభోదయం' కార్యక్రమంలో భాగంగా రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కేటాయించే నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తున్నామని, దమ్మపేటను మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే దస్తగీర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యం.. దమ్మపేటలో జనసేన ఆత్మీయ సమ్మేళనం ఘన విజయం



**దమ్మపేట, ఆగస్టు 02 (భద్రాద్రి న్యూస్):** దమ్మపేట మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు ఎస్కే రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడు గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ముందు వందలాది మోటార్ సైకిళ్లతో దమ్మపేట పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన జెండాలు చేతబూని కార్యకర్తలు చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఎస్కే రహీం మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, యువత, మహిళలు, జనసైనికులు భారీగా హాజరయ్యారు.

## వైరాలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల జాతర

**- పోచమ్మ తల్లి ఊరేగింపులో అత్యధికంగా పాల్గొన్న మహిళలు**

**- పోచమ్మ తల్లి బోనమెత్తిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రకళ**





**వైరా, ఆగస్టు 2, (భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ద్వారకా నగర్ లో ఆదివారం శ్రీకృష్ణ పాల పోచమ్మ తల్లి దేవాలయంలో భక్తులు బోనాల జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బోనాలు వేడుక కార్యక్రమంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ పాల్గొని అమ్మవారికి బోనం ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా పట్టణంలో మహిళలు బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ అషాడ మాసంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం శుభప్రదమని, సకాలంలో వర్షాలు అనుకున్నంతగా పడి, పాడిపంటలతో, కరువు కాటకాలు లేకుండా, సమాజం సుభిక్షంగా ఉండాలని తల్లికి బోనాలు సమర్పించడం శుభప్రదమని అన్నారు. వైరా నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, మోర్ శ్రీకాంత్, దొడ్డ పుల్లయ్య, చంద్రశేఖర్ రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, ఉంద్రు శ్యాంబాబు, కర్నాటి హనుమంతరావు, వీరయ్య, ఖమ్మంపాడు సత్యనారాయణ, తోటకూర వీరబాబు, ద్వారకా నగర్ యూత్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రాందాస్ మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

*- కొండబోయిన నాగేశ్వరరావు*



**కారేపల్లి, ఆగస్టు 2(భద్రాద్రి న్యూస్ రాములు):** మాదారం గ్రామ శాఖ సభ్యుడు, డోలమైట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు తేజావత్ రాందాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదకరమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. మంచుకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాందాస్ భౌతికకాయాన్ని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాందాస్ కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు పార్టీ నిర్మాణంలోనూ చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని, రాందాస్ మృతి పార్టీకి, కార్మిక ఉద్యమానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాదాన్ని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఎదుర్కొనేలా మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారం మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ నాయక్, మంగళతండా సర్పంచ్, పార్టీ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా బిషప్ డాక్టర్ రేవ కె సేనం రాజ్ పట్టాభిషేకం

**- హాజరైన మోడరేటర్ డాక్టర్ ప్రొఫెసర్ రేవ కే రూబెన్ మార్క్,**
**నంద్యాల బిషప్ డాక్టర్ రేవ కే సంతోష్ ప్రసన్న రావు**
**భారీగా హాజరైన బిషప్పులు, మత గురువులు, విశ్వాసులు**










**వడిగ రాజ్ కుమార్ స్టాఫ్ రిపోర్టర్**
**పాలేరు, ఆగస్ట్ 2(భద్రాద్రి న్యూస్):** సి ఎస్ ఐ డోర్నకల్ నూతన 10 వ బిషప్ గా డాక్టర్ రేవ కే సేనం రాజ్ పట్టాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. డోర్నకల్ దయాసిస్ కేంద్రంలో సి నాడు మోడిటర్ డాక్టర్ ప్రొఫెసర్ కె రూబిన్ మార్క్, నంద్యాల బిషప్ డాక్టర్ రేవ కె సంతోష్ ప్రసన్న రావు, ఏడుగురు బిషప్పుల ఆధ్వర్యంలో నూతన బిషప్ సేనం రాజ్ బాధ్యతలు స్వీకరణ వేడుక ఘనంగా జరిగింది. బిషప్ వరప్రసాదరావు ప్రసంగిస్తూ.. గొర్రెలకు కాపరి ఎంత అవసరమో డోర్నకల్ అధ్యక్ష మండలానికి కూడా పీఠాధిపతి అంతే అవసరమని ఈ సందర్భంగా తెలిపారు. వాక్య సందేశం అనంతరం బిషప్ సైనం రాజుకు బైబిల్, ఉంగరం, మెడలో సిలువ, స్టాఫ్(రాజదండం కర్ర ) బిషప్ నియామక పత్రాలను మోడిటర్ డాక్టర్ ప్రొఫెసర్ కే రూబేన్ మార్క్, డిప్యూటీ మోడరేటర్, నంద్యాల బిషప్ డాక్టర్ కె సంతోష్ ప్రసన్న రావు లు బహుకరించారు. అనంతరం నూతన బిషప్ లు ఆసనంపై కూర్చోబెట్టారు. ఈ వేడుక అనంతరం సభలో మోడరేటర్ డాక్టర్ ప్రొఫెసర్ కే రూబేన్ మార్క్ మాట్లాడుతూ... ఒక తల్లి బిడ్డకు జన్మని ఇవ్వాలి అంటే తొమ్మిది నెల మాంసం పడుతుంది డోర్నకల్ అధ్యక్ష ఖండానికి 48 గంటల్లో బిషప్ గా సేనం రాజ్ జన్మించాడని తెలిపాడు. బిషప్ సేనం రాజుకు దేవుడు ఎల్లప్పుడూ తోడై ఉన్నందువలన పరిపాలనాధికారిగా బాధ్యతలు చేకూరాలని ఆయన పేర్కొన్నాడు.. నంద్యాల బిషప్ డాక్టర్ రేవ కే సంతోష్ ప్రసన్న రావు బిషప్ సేనం రాజుకు ఉంగరం తొడిగిన



అనంతరం మాట్లాడుతూ... లోక రక్షకుడైన ఏసుప్రభు ఈ డోర్నకల్ దయాసిస్కు కాపరిగా ఉండాలని సేనం రాజును ఆదేశించారని ఐదు రాష్ట్రాల పరిధిలో ఉన్న డోర్నకల్ బిషప్ భవిష్యత్తులో నూతన వెలుగులు తో మరింత ఖ్యాతి పెంపొందించాలని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన బిషప్ డాక్టర్ కే సైనం రాజు మాట్లాడుతూ తనకు ధనం గాని ,ఆస్తులు గాని, లేకపోయినప్పటికీ దేవుని ఆశీర్వాదంతో డోర్నకల్ డైసిస్కు పీఠ కాపరిగా అయ్యే అవకాశం దక్కిందని భావ ఉద్వేగంతో తెలిపారు. పీఠాధిపతిగా డైసిస్ పరిధిలోని రాష్ట్రాల్లో ఉన్న అన్ని చర్చిలలో ఆధ్యాత్మిక వెలుగులు తెచ్చేందుకు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులలో, కార్పొరేట్ అంగులతో తీర్చిదిద్ది మహోన్నతమైన సేవా కేంద్రాలుగా రూపొందించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని తెలిపారు. తనకు పీఠాధిపతిగా అవకాశం అందించిన మోడరేటర్, డాక్టర్ ప్రొఫెసర్ కే రూబెన్ మార్క్ కు తనను అభిషేకించిన ఏడుగురు బిషప్పులకు, ఈ వేడుకకు హాజరైన, మత గురువులకు, విశ్వాసులకు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్వాయర్ ఆలపించిన ఆధ్యాత్మిక గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం నూతన బిషప్ డాక్టర్ కే సేనం రాజును శాలువాలతో, బొకేలతో, జ్ఞాపికలతో, పెద్ద ఎత్తున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి పీఠాధిపతి డాక్టర్ రేవ పద్మారావు, విజయ పద్మారావు, నంద్యాల బిషప్ అమ్మ బ్యూలా సంతోష్ ప్రసన్న రావు, మెదక్ అధ్యక్ష మండల వైస్ చైర్మన్ గురువులు డాక్టర్ టి డి భాస్కర్ , విమల్ సుకుమార్, రత్న రాజ్ ఫెర్నాండెస్, డోర్నకల్ డైసిషన్ సెక్రటరీ డాక్టర్ రేవ వి విశ్వం, బిజీ క్లైమేట్, గ్రూప్ చైర్మన్లు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభ కరపత్ర ఆవిష్కరణ

**- ఆదివాసీ దినోత్సవ సభను జయప్రదం చేయాలి**

**- LHPS రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్**

**అన్నపురెడ్డిపల్లి ఆగస్టు 02: (భద్రాద్రి న్యూస్)** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి (లాహూ) నంగారా బేరి ఆధ్వర్యంలో ఆగస్టు 9న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ (గిరిజన) దినోత్సవ సభ కరపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆవిష్కరించారు. గిరిజన ఆదివాసీల ఆత్మగౌరవం -- మన హక్కుల సాధనే మన లక్ష్యం అనే నినాదంతో ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు, బంజారాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సభ 09-08-2026 ఆదివారం ఉదయం 10:00 గంటలకు కొత్తగూడెం క్లబ్ జరగనుంది.

ప్రధాన డిమాండ్లు:

గోర్ బోలి (బంజారా భాష) ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలి.

ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన 7.5% నుండి 14%కి పెంచాలి. తెలంగాణ రాష్ట్రం కేటాయించిన ఎస్టీల 10% రిజర్వేషన్‌ను వెంటనే 9వ షెడ్యూల్లో చేర్చాలి.

దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలందరినీ ఒకే ఎస్టీ జాబితాలో చేర్చాలి.

తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా మార్చడంతో పాటు ప్రత్యేకంగా తండా డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలి.

ఎస్టీలు సాగు చేస్తున్న లావాణి, సీలింగ్, పోడు భూములకు శాశ్వతంగా పూర్తి హక్కులతో కూడిన పట్టాలను అసెంబ్లీలో చట్టం చేసి అందించాలి. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ



ప్రాంతాల్లో ఎస్టీలకు 100% రిజర్వేషన్లు రాష్ట్రంలో అమలు చేయాలి. ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారావు, సీనియర్ నాయకులు భీముడు నాయక్, వైరా ఇంచార్జ్ నాగేశ్వరావు, మండల అధ్యక్షులు లకావత్ రాజు,సభ్యులు లకావత్ సత్యనారాయణ, భూక్య రాము, బాణోత్ బాలాజీ, భూక్య బాలాజీ, లకావత్ రమేష్, లకావత్ చెన్నారావు,భూక్య అర్జున్ ప్రసాద్ అర్జున్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా ఉద్యమించాలి

*- మాలల న్యాయ పోరాట సదస్సులో వక్తలు*



**కామేపల్లి,ఆగస్టు 2 (భద్రాద్రి న్యూస్):** హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా ఉద్యమించాలని హైకోర్టు అడ్వకేట్ పల్లా రాజశేఖర్, అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవి, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షులు గుంతేటి వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మాలల న్యాయ పోరాట సభ కు మంచాల నాగరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణను వెంటనే రద్దుచేసి సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం వాస్తవ లబ్ధిదారుల వివరాల ఆధారంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని ఒక గ్రూపుగా వెనకబడిన వారిని మరో గ్రూపుగా వర్గీకరించి ఎస్సీల్లో 59 కులాలకు న్యాయం చేయాలని కోరారు.ఎన్నికల ముందు చేవెళ్ల సభలో కాంగ్రెస్ పెద్దలు చేసిన ఎస్సీ,ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్ లోని హామీలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో ఎస్సీలకు 18 శాతం వాటా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ కి సంవత్సరానికి 750 కోట్ల రూపాయల చొప్పున నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి మండలంలో ఎస్సీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి గ్రాడ్యుయేషన్ పీజీ చదివే ఎస్సీ విద్యార్థులకు ఉచిత వసతి కల్పించాలని కోరారు.వీటిని ప్రభుత్వం వెంటనే అమలు చేయకుంటే తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీం కన్వీనర్ దాసరి రమేష్,తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు రిటైర్డ్ జీఎం శనగ వెంకటేశ్వర్లు, బరగడి దేవాదానం, కో కన్వీనర్లు శెట్టి కమలాకర్, బూర్గుల కమలాకర్, గడ్డం రాగన్ బాబు, శనగ స్వామి, పంతగాని రాజశేఖర్ మేడిపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కాలి

*--బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు*



**నేలకొండపల్లి, (భద్రాద్రి న్యూస్) ఆగష్టు 2:** తెలంగాణ ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు కోరారు. 1969 నుంచి నేటి వరకు తెలంగాణ ఉద్యమంలో అనేక ప్రజాసంఘాలు పనిచేశాయి. అవి ప్రజలను కూడగట్టి, ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టాయి. త్యాగాలు చేశాయి. నెత్తురు ధారపోశాయి. ఈ పునాదిపై నిర్మాణమైన రాజకీయ పార్టీలు ఓట్లు దండుకుంటున్నాయి. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇంతటి పాత్ర నిర్వహించిన ప్రజా సంఘాల చరిత్రను విస్మరించి దశాబ్దకాలం పాలించిన కేసీఆర్ గానీ, రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న రేవంత్రెడ్డి ప్రభుత్వం గానీ ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వలేదు. ఇంకా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ వారిని అవమానపరచటం శోచనీయం. ప్రతి సందర్భంలో పోరాడే శక్తులు కనుమరుగైనట్లే తెలంగాణ ఉద్యమంలో కూడా ఉద్యమకారులకు పార్లమెంటరీ పార్టీలు అన్యాయం చేశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కూడా అవే పరిస్థితులు నికార్సయిన ఉద్యమకారులకు ఎదురవు తున్నాయి. ఈ పరిణామాలతో తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర కనుమరుగు చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ ఉద్యమకారులు అప్రమత్తంగా ఉంటూ సమగ్ర తెలంగాణ చరిత్రను నిర్మాణం చేసే బాధ్యతను తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముందు తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ పలు న్యాయమైన డిమాండ్లను ఉంచుతున్నది. అవి- 1) తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, మూడు దశల తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను రికార్డు చేయాలి. 2) ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షతో అమరత్వం పొందిన ఉద్యమ అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. వీరి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాలి. 3) తెలంగాణ ప్రజాఫ్రంట్ మాజీ అధ్యక్షులు ఆకుల భూమయ్య హత్యకు కారణమైన వారిని గుర్తించి, శిక్షించాలి. 4) ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు బలమైన ఊతం అందించిన వరంగల్ డిక్లరేషన్ సభలో ప్రవేశపెట్టిన అంశాలు అమ లయ్యేలా చూడాలి. 5) ఉద్యమంలో అమరత్వం పొందిన వారి స్మారక స్థూపాలను ప్రభుత్వమే అధికారికంగా నెలకొల్పాలి. 6) తెలంగాణ పోరాటంలో విద్యార్థి, ఉద్యమ కారులపై నమోదైన 'ఊపా' తదితర కేసులను వెంటనే ఎత్తివేయాలి. 'ఎన్ఐఏ' తరహా దాడులను అరికట్టి రాజకీయ ఖైదీల విడుదలకు ప్రభుత్వం పూనుకోవాలి. 7) తొలితరం ఉద్యమ శిఖరం, తెలంగాణకు దీపస్తంభం వంటి వరవరరావుని తెలంగాణకు తీసుకు వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. 8) అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలలో అమరవీరుల స్మారక స్థూపాలను నిర్మించి అధికారికంగా శ్రద్ధాంజలి ఘటించాలి. 9) విభజనను వ్యతిరేకించిన వ్యక్తుల గుర్తులను తెలంగాణలో తొలగించాలి. 10) తెలంగాణ భాషను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి. తెలంగాణ అస్తిత్వానికి భంగం వాటిల్లకుండా చూడాలి.

# ఆగస్టు 7న హైదరాబాద్ లో పెన్షనర్ల మహా ధర్నా

**- ఎస్ జి పి ఎ టి రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2,( భద్రాద్రి న్యూస్)** సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి అని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద పెన్షనర్ల జె ఏ సి ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీన "మహా ధర్నా" నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్ జి పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ తెలిపారు. ఈ రోజు వరంగల్ లో జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నా సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని " మూడేళ్లు గడిచినా పి ఆర్ సి జాడ లేదని, పెండింగ్ డి ఏ ల ఊసే లేదని , హెల్త్ కార్డుల విషయంలో కదలిక లేదని" విమర్శించారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య " ప్రతి యూనిట్ నుండి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా యూనిట్ బాధ్యులు " కృషి చేయాలని సూచించారు.ఉద్యమాల ద్వారానే మన సమస్యలు పరిష్కరించుకోవాలని ,అందుకే ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రు సుధీర్ బాబు " మూడు మాసాలుగా హెల్త్ కార్డులకు సంబంధించి ప్రీమియం మినహాయించినప్పటికీ నేటికి అమలు కాకపోవటం శోచనీయం అని, స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ల సమస్య పరిష్కారం కాకపోవడం లాంటి సమస్యలున్నాయని ,వీటి పరిష్కారానికి ఉద్యమమే మార్గమని తెలిపారు. జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య" రిటైర్ అయిన ఉద్యోగ,ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో పెండింగ్ బిల్లులు చెల్లించకుండానే, ప్రభుత్వం అవాస్తవ ప్రకటనలు చేస్తున్నదని, వెంటనే వారికి రావలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ యూనిట్లకు సంబంధించిన బాధ్యులు శ్రీయుతులు కె కుమారస్వామి, కె కృష్ణ కుమార్, ఆర్ వెంకటా చలం, బేతి నరసింహ స్వామి,గూడూరు శ్రీనివాస రావు,గుర్రం నరసింహ రాములు, నామాని సత్యనారాయణ, కె సుధాకర్, వేల్పుల రవీందర్, డా! వెంకట నారాయణ ,కె కృష్ణమూర్తి,వలబోజు సోమేశ్వర రావు, కె మధుసూదన్ రావు, సి హెచ్ సారంగపాణి తదితరులతో పాటు 60 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

# ఎంటెక్ డేటా సైన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన అగ్ని మండల రాజేశ్వరి

**శుభాకాంక్షలు తెలిపిన**

**కాంగ్రెస్ నాయకులు మందలపు సాయిబాబా చౌదరి**

**కూకట్ పల్లి, ఆగస్ట్ 2:**



కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన అగ్నిమండల రాజరాజేశ్వరి గీతం హైదరాబాద్‌లో ఎం.టెక్ డేటా సైన్స్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు. ఈ ఘనవిజయం సాధించిన సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి సాధించిన ఈ విజయం వసంతనగర్ డివిజన్‌కే కాకుండా కూకట్‌పల్లి నియోజకవర్గానికే ఆదర్శమని పేర్కొన్నారు.గీతం యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను గుర్తించి, విశాఖపట్నం లోక్‌సభ సభ్యులు, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి భరత్ చేతుల మీదుగా, అలాగే ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రతిభా సర్టిఫికెట్ అందజేశారు.ఈ విషయం తెలుసుకున్న వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి మరోసారి ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే అగ్నిమండల రాజరాజేశ్వరి తల్లి అగ్నిమండల విజయలక్ష్మి ని కూడా ప్రత్యేకంగా అభినందించారు. స్వయంకృషితో తన ఇద్దరు పిల్లలను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న విజయలక్ష్మి సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

# ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్

- దేవరపల్లి రహదారిపై ప్రయాణించిన మంత్రి తుమ్మల
- నితిన్ గడ్కరీ అనుమతితో సాకారమైన ప్రాజెక్టు
- రూ.3,573 కోట్లతో నిర్మాణం పూర్తి
- హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర, పశ్చిమ బెంగాల్‌కు నేరుగా అనుసంధానం
- ప్రయాణ సమయం సగానికి తగ్గింపు
- ఆరు గంటల నుంచి రెండున్నర గంటల్లో
- రైతులు స్థానికలకు ఉపాధి రవాణా వరం
- 2017 నుంచి నిరంతర పర్యవేక్షణ
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2,( భద్రాద్రి న్యూస్) :** తెలుగు రాష్ట్రాల ప్రజలు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైటెక్ హైవేపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదంతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా దేవరపల్లి రహదారిపై ప్రయాణించి పరిస్థితిని పరిశీలించారు. తెలంగాణ తొలి రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి తుమ్మల చిరకాల స్వప్నం ఎట్టకేలకు నెరవేరింది. మంత్రి తుమ్మల ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 1న అధికారులు రాకపోకలకు అనుమతించారు. అనధికారికంగా ప్రజల రాకపోకలు కొనసాగడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా ఈ రహదారిపై ప్రయాణించడం విశేషం.

**తుమ్మల కృషి ఫలితం: 2017 నుంచి నిరంతర పర్యవేక్షణ**

కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అనుమతి మంజూరు చేయగా, అప్పటి కేంద్ర రహదారుల కార్యదర్శి గిరిధర్ (ఐఏఎస్) సహకారంతో 2017లోనే డీపీఆర్ సిద్ధం చేయించి, 2018 నాటికే భూసేకరణ పూర్తి చేయించడం ద్వారా మంత్రి తుమ్మల ఈ ప్రాజెక్టుకు వేగం అందించారు. టెండర్ల దశ నుంచి పనుల పూర్తి వరకూ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ధ్వంసలాపురం, కల్లూరు, వేంసూర్ వంటి కీలక ప్రాంతాల్లో కొత్త ఎగ్జిట్ పాయింట్ల మంజూరుపై ప్రత్యేకంగా కృషి చేసి సాధించారు. దీనిపై స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**రూ.3,573 కోట్లతో నిర్మాణం - 165 కి.మీ. పొడవు**

భారత్‌మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద నిర్మించిన ఈ రహదారి తెలంగాణలోని ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద ప్రారంభమై, ఏపీలోని రాజమండ్రి సమీపంలోని దేవరపల్లి వద్ద (జాతీయ రహదారి-16పై) ముగుస్తుంది. మొత్తం 165 కిలోమీటర్ల పొడవులో - తెలంగాణలో 90 కి.మీ., ఏపీలో 75 కి.మీ. మేర ఈ రహదారి విస్తరించి ఉంది.

ఈ మార్గం అందుబాటులోకి రావడంతో హైదరాబాద్-రాజమండ్రి-విశాఖపట్నం మధ్య ప్రయాణికులు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. తద్వారా సుమారు 56 కిలోమీటర్ల దూరం, సూర్యాపేట నుంచి చూస్తే దాదాపు 100 కిలోమీటర్ల దూరం ఆదా అవుతుంది. గతంలో సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి చేరుకోవాలంటే 4-6 గంటలు పట్టేది కాగా, కొత్త హైవేతో కేవలం రెండున్నర గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ కారిడార్ ద్వారా ఏపీలోని ఏడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, పశ్చిమ బెంగాల్, కలకత్తా వరకూ నేరుగా అనుసంధానం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

**తెలుగు రాష్ట్రాల్లోనే తొలి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే**

ఈ రహదారి తెలుగు రాష్ట్రాల్లోనే తొలి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా ప్రత్యేకత సంతరించుకుంది. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మాత్రమే ప్రవేశం కల్పిస్తూ, ప్రతి 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరాన్ని బట్టి టోల్ వసూలు చేసే 'క్లోజ్డ్ టోలింగ్ సిస్టం'ను అందుబాటులోకి తెచ్చారు.

భద్రత కోణంలో ఐదు చోట్ల అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏటీఎంఎస్), ప్రతి 2 కిలోమీటర్లకు 360 డిగ్రీల సీసీ కెమెరాలు, సోలార్ దీపాలు, ప్రతి 5 కిలోమీటర్లకు ఎమర్జెన్సీ ఓపెనింగ్‌లు ఏర్పాటు చేశారు. అతివేగం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ కెమెరాలు గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేస్తాయి. ప్రతి 50 కిలోమీటర్లకు 5 ఎకరాల విస్తీర్ణంలో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్‌ల వంటి సదుపాయాలు కల్పించారు. క్యూఆర్ కోడ్ ద్వారా సమీప పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు కూడా ఉంది. గరిష్ఠంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలుంది.

**రైతులకు, స్థానికులకు వరం**

పచ్చని పంట పొలాల మధ్య నుంచి సాగే ఈ రహదారి ప్రయాణికులకే కాక రైతులు, స్థానికులకు కూడా ఎంతో ఉపయోగపడనుంది. ఈ ప్రాజెక్టు వెంబడి ఉన్న ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సౌలభ్యం, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2017లో ప్రతిపాదన రూపొందిన ఈ ప్రాజెక్టు అన్ని అడ్డంకులను అధిగమించి నేడు పూర్తిస్థాయిలో సాకారమైంది. ఈ హైవే అందుబాటులోకి రావడంతో ప్రయాణ సమయం, వ్యయం ఆదా కావడమే కాక, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఆర్థిక, రవాణా బంధాలు మరింత బలోపేతం కానున్నాయని అధికారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**"నా ప్రయత్నాలు ఫలించాయి" - మంత్రి తుమ్మల**

ఈ ప్రాజెక్టు కోసం తాను వేసిన ప్రతి అడుగూ ఫలించిందని, దశాబ్ద కాలంగా పడిన శ్రమ ఈ రోజు కళ్లెదుటే సాకారమైందని మంత్రి తుమ్మల పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేవరపల్లి రహదారిపై స్వయంగా ప్రయాణించి పరిస్థితులను పరిశీలించిన ఆయన, తాను మొదలుపెట్టిన ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా విజయవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని, ఇది కేవలం ఒక రహదారి కాదని, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య శాశ్వత అనుబంధానికి వారధి అని వ్యాఖ్యానించారు.




# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

**భోగాపురం, ఆగస్ట్ 2 :**

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమిలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది.

# వేణుకుమార్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు నామ, పువ్వాడ, తాత మధు

**- కుటుంబ సభ్యులకు ధైర్యం.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2,( భద్రాద్రి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం పై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం, లక్ష్మీపురంకు చెందిన జి. వేణుకుమార్ ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి వేణుకుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వేణుకుమార్ రాసిన లేఖను పరిశీలించిన అనంతరం ఆయన నాయనమ్మ, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. వేణుకుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ వైద్యులకు బీఆర్ఎస్ నేతలు సూచించారు. అలాగే వెను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల (=జీజ) కృష్ణ, సీనియర్ నాయకులు ఉ ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, వాచేపల్లి లక్ష్మా రెడ్డి, అజ్మీరా వీరు నాయక్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్ షేక్ మక్బూల్, అయ్యప్పరెడ్డి జ్యోతి రెడ్డి, నాయకులు సామినేని హరిప్రసాద్, బిరెడ్డి నాగచంద్రారెడ్డి, బంక మల్లయ్య, మహమ్మద్



రఫీ, మోరంపూడి ప్రసాద్, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, గడ్డం వెంకట్, పగడాల రవికుమార్, ఆరెంపుల వీరభద్రం, యడవల్లి బిక్షం, మాటేటి కిరణ్ కుమార్, నాగార్జున, శంకర్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.